

ఏ తప్పూ చేయకున్నా..
విధి నిర్వహణకే వచ్చినా..
ఒక్కడిని చేసి..
మూకగా చుట్టుముట్టారు..
చెంపలపై చాచి.. చాచి.. కొట్టారు..
ఇష్టారాజ్యంగా తోసి పడేశారు..
కిందపడినా కరుణ చూపలేదు..
పిడిగుద్దులు గుద్దారు..
కాళ్లతో తన్నారు..
మోకాళ్లతో ముఖమ్మీద గుద్దారు..
కర్రలతో బాదారు..
చొక్కా చిరిగేలా కొట్టారు..
స్పృహ కోల్పోయేలా ఉన్నా..
కనికరం చూపలేదు..
ఆఖరుకు అక్కడి నుంచి వెళ్లిపోతున్నా..
వెంటాడి.. వెంటాడి.. దాడి చేశారు..
ప్రజాస్వామ్య దేశంలో..
సాక్షాత్తూ సీఎం హాజరైన సభలో
ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై
వైసీపీ మూకలు సాగించిన
ఆటవిక దాడి ఇది...
ప్రజాస్వామ్యవాదులుగా
ఈ దుర్మార్గాన్ని ఖండించాల్సిన
బాధ్యత అందరిదీ..
కలం సంఘాలన్నీ కదలివస్తున్నాయి..
గళం విప్పేందుకు..
పత్రికాస్వేచ్ఛ పరిరక్షణకు..
హక్కులపై నినదించేందుకు..
పాలకులు, అధికారులను
నిలదీసేందుకు..
కదులుదాం.. అందరం ఒక్కటై..



నిలదీద్దాం...

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా నేడు చలో అనంతపురం

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా
- తరలిరానున్న జర్నలిస్టు రాష్ట్ర నేతలు

(వివరాలు 7లో...)







- దిగుమతి అయినా.. తగ్గేదేలే..
- ఆదాయ వనరులు, మార్గాలపై దృష్టి
- అధికారులపై ఒత్తిళ్లు
- దీర్ఘకాలిక సెలవులోకి సబ్ రిజిస్ట్రార్
- అదేబాటలో మరొకరు





హిందూపురం

అందరూ ఊహించిందే జరుగుతోంది. దిగుమతి అయిన వైసీపీ ఇన్‌చార్జిపై జనాల్లో ఎన్నెన్నో భయాలున్నాయి. లూటీ చేస్తారన్న ఆందోళనలు నెలకొన్నాయి. వాటిని నిజం చేస్తూ ఆ ఇన్‌చార్జి లూటీ స్టార్ట్ చేసేశారు. ఆదాయ వనరులు, మార్గాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆయా మార్గాల్లో వసూళ్ల వేట మొదలెట్టినట్లు చర్చ సాగుతోంది. ఆ దిశగా అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. వాటిని భరించలేక అధికారులు వెళ్లిపోతున్నారు. ఉన్నవారు కూడా.. ఇక్కడ పని చేయలేమంటూ దీర్ఘకాలిక సెలవు, బదిలీ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ ఇన్‌చార్జి అంటేనే హడలిపోతున్నారు.

లూటీ స్టార్ట్!

వైసీపీ ఇన్‌చార్జి వసూళ్ల వేట



ఇక్కడ పనిచేయలేం..

ఇటీవల బదిలీపై వచ్చిన ఓ అధికారిని పార్టీ కార్యాలయానికి రావాలని ఇన్‌చార్జి వర్గీయులు సమాచారం ఇచ్చారట. తాను వచ్చింది ఎన్నికల విధులకేననీ, పార్టీ కార్యాలయానికి రాను అంటూ అధికార పార్టీ నాయకుల మొహంపై చెప్పినట్లు సమాచారం. ఏదైనా ఉంటే అధికారులతో సమీక్ష పెడితే వేరే చోటికి వస్తాను తప్ప.. అక్కడికి రానని చెప్పినట్లు తెలిసింది. అవసరమైతే పెట్టుకోండి.. లేదంటే పంపినా వెళ్లేందుకు సిద్ధమేనని స్పష్టం చేసినట్లు కార్యాలయంలో చర్చ సాగుతోంది.



ఆదాయ వనరులపై దృష్టి

ఎన్నికలు సమీపిస్తున్నాయి. నోటిఫికేషన్ ఏ క్షణమైనా రావచ్చు. ఆలోపే అనుకున్న లక్ష్యం నెరవేరాలన్నది అధికార పార్టీ నాయకుల ఆలోచన. దీంతో వచ్చీరాగానే ఆ నియోజకవర్గంలో ఆదాయ వనరులపై దృష్టి పెట్టారు. ఎక్కడెక్కడ రాబడి ఉంది, ఏయే కార్యాలయం నుంచి ఏయే పనులు చక్కదిద్దుకోవాలో ఆ ప్రజాప్రతినిధికి వెన్నతో పెట్టిన విద్య అని ఇక్కడకు దిగుమతైన ప్రాంతంలో కథలు కథలుగా చెబుతుంటారు. అదే ఒరవడికి ఇక్కడ కూడా శ్రీకారం చుట్టారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పనులు కూడా వేగవంతం చేస్తున్నారు. దీనివల్ల ఇక్కడ ఉద్యోగం చేయాలంటేనే ముఖ్య శాఖల అధికారులు హడలెత్తిపోతున్నారు. ఈ కారణంగా ఓ అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా.. మరొకరు అదేబాట పట్టారని సమాచారం. సెలవుకు దరఖాస్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఆ ప్రజాప్రతినిధి వ్యవహారం తెలిసిన వారు ఇది సర్వసాధారణమే అంటున్నారు. నియోజకవర్గానికే కొత్త అన్న చర్చ సాగుతోంది. ఎన్నికల ముందొచ్చారు కాబట్టి సరిపోయిందనీ, ఇంకాస్త ముందుగా వచ్చి ఉండుంటే ఈ ప్రాంతం లూటీనే అని అధికార పార్టీకి చెందినవారు చర్చించుకోవడం గమనార్హం.

సెలవు వెనుక కథేంటి?

ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను గుర్తించిన వైసీపీ అధిష్టానం ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పుచేర్పులు చేపట్టింది. ఇందులో భాగంగా పక్క జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధిని జిల్లాలోని ఓ నియోజకవర్గానికి బదిలీ చేశారు. వచ్చిన కొన్నిరోజులు పల్లెల వైపు ఆ ఇన్‌చార్జి దృష్టి పెట్టారు. ఎన్నికలు దగ్గరపడ్డాయి, ఇక ఉండేది రోజులే కాబట్టి అందుకు తగ్గట్టుగా ఆదాయ వనరులపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ ఖర్చులు అధికంగా ఉంటాయనీ, కొన్ని శాఖల అధికారులు వాటిని భరించాల్సి ఉంటుందని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల ద్వారా సమాలోచన చేశారు. అందుకు తగ్గట్టుగానే ఆదాయ వనరులపై కన్నేశారు. ఆ నియోజకవర్గంలో జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధిచెందిన పరిశ్రమ కూడా ఉంది. ఆదాయ వనరులు ఏశాఖ నుంచి వస్తాయో గమనించారు. వాటిపై దృష్టి పెట్టారని చర్చ సాగుతోంది. అనుకున్నదే తడవుగా ఓ శాఖ అధికారిని పిలిపించుకుని మాట్లాడారట. తను ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయం నిర్మించుకోవాలనీ, అందుకు తగ్గట్టుగా స్థలం కావాలని ఆదేశించినట్లు సమాచారం. అది ఫలానా ప్రాంతంలో ఉందనీ, అక్కడ ఉన్న లేఔట్‌లో రిజిస్ట్రేషన్లు ఆపాలని సదరు అధికారికి ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారని తెలుస్తోంది. అంతకన్నా ముందు లేఔట్ వేసిన స్థలంలో 20 సెంట్లకుపైగా స్థలం కావాలనీ, సెంటు రూ.4లక్షలకే ఇవ్వాలని డిమాండ్ చేశారట. ప్రస్తుతం అక్కడ సెంటు విలువ రూ.8లక్షలుపైగా పలుకుతోంది. దీంతో తాము అడిగిన ధరకే ఇవ్వాలని సంబంధిత రియల్టర్‌పై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఆ రియల్ వ్యాపారిని బెదిరించడంతో భయపడినట్లు సమాచారం. ఆ ధరకు ఇవ్వలేమని చెప్పడంతో సంబంధిత శాఖాధికారికి ఆ లేఔట్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయకూడదని ఆదేశాలిచ్చారని తెలుస్తోంది. పార్టీ ఖర్చులుంటాయనీ, అందుకు తగ్గట్టుగా భాగస్వామ్యం కావాలని సున్నితంగా సూచించినట్లు ఆ ప్రాంతంలో అధికార పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు. దీంతో సదరు అధికారి చేసేదిలేక నాలుగు రోజుల క్రితం సెలవుపెట్టి వెళ్లిపోయినట్లు తెలిసింది. అదికూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనివార్య కారణాలవల్ల సెలవు పెట్టినట్లు ఆ అధికారి చెప్పినా.. వాస్తవాలు మాత్రం వేరేరకంగా ఉన్నాయని ఆ కార్యాలయంలో పనిచేసే కొంతమంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



తృతీయశ్రేణి అధికారికి బెదిరింపులు

గతంలో ఉన్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి అనుచరులకు 200 మందిదాకా స్థలాలు ఇచ్చారు. తాము కూడా కొన్ని చెబుతున్నామనీ, ఇవ్వాల్సిందేనంటూ కార్యాలయంలోని తృతీయ శ్రేణి అధికారిని బెదిరించినట్లు సమాచారం. అప్పట్లో ఉన్న నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి చెప్పడంతో నిబంధనల ప్రకారం కొందరికి మాత్రమే స్థలాలు ఇచ్చామని ఆ అధికారి చెప్పుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న ప్రజాప్రతినిధి అంగరక్షకులకు స్థలాలు ఎలా ఇచ్చారని ప్రస్తుత ప్రజాప్రతినిధి ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఆ తృతీయశ్రేణి అధికారితోపాటు ఓ ముఖ్య అధికారి వద్ద ఉన్న మరో అధికారిపై వేటు పడుతుందని బెదిరించినట్లు సమాచారం.



మరో అధికారి సెలవుకు దరఖాస్తు

కొంతకాలం క్రితం నుంచి ఇక్కడ పనిచేస్తున్న అధికారిపై ప్రస్తుత ప్రజాప్రతినిధి కొన్ని వ్యవహారాల్లో ఒత్తిడి తెచ్చినట్లు చర్చ సాగుతోంది. ఎన్నికల ముందు అలా చేయలేమనీ, చెప్పినట్లు చేయాలంటే నిధులు తీసుకురావాలని కొంతమంది నాయకులకు సదరు అధికారి సూచించినట్లు తెలుస్తోంది. నిధులు లేకుండా బిల్లులు చేయమంటే తాను చేయలేనని కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ఇలా ఒత్తిడి తెస్తే తామేం చేయలేమనీ, నిబంధనలు అతిక్రమించి చేయడం కన్నా.. ఇక్కడి నుంచి వెళ్లిపోవడానికే సిద్ధంగా ఉన్నట్లు వైసీపీ నాయకులకు సదరు అధికారి చెప్పారని చర్చ సాగుతోంది. దీంతో మూడు రోజుల క్రితమే సెలవైనా ఇవ్వాలనీ, లేదంటే వేరేచోటికి బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధి దెబ్బకు నియోజకవర్గ కేంద్రంలోని ముఖ్యశాఖల అధికారులు హడలెత్తిపోతున్నారు.

బీడుపల్లి హెచ్‌ఎం సస్పెన్షన్

కొత్తచెరువు, ఫిబ్రవరి 21: పుట్టపర్తి మండలం బీడుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆమెను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎం తీరుపై స్కూల్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్పందనలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో విచారించగా.. హెచ్‌ఎం.. తోటి ఉపాధ్యాయుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, మధ్యాహ్న భోజన బియ్యం సైతం తన ఇంటికి తరలించినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి.. హెచ్‌ఎం లక్ష్మీదేవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె వివరించారు.

వలంటీరు కబ్జా..!

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

చుట్టూ బండలు నాటి.. నిర్మాణాలకు సిద్ధం



వలంటీరు కబ్జా చేసి చుట్టూ బండలు నాటిన స్థలం



రొద్దం, ఫిబ్రవరి 21: గ్రామ వలంటీరు కబ్జాకు తెరలేపింది. దాదాపు రూ.6 లక్షల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించింది. దర్జాగా చుట్టూ బండలు నాటి, నిర్మాణాలకు సైతం ఉపక్రమించింది. మండలంలోని పెద్ద గువ్వలపల్లి గ్రామ వలంటీరు చంద్రకళ కబ్జా తతంగమిది. గ్రామ పరిధి సర్వే నంబరు 1278లో 15.73 ఎకరాల ఆంజనేయ స్వామి మాన్యం భూమి ఉంది. ఇందులో టీడీపీ హయాంలో ఐదెకరాల దాకా ఎండోమెంట్ వారికి డబ్బు చెల్లించి, ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో పేదలకు పట్టాలు మంజూరుచేసి, ఇళ్లు కట్టించారు. ఇంకా రెండెకరాలకు పైగా భూమి మిగిలింది. భవిష్యత్తు అవసరాల కోసం అలాగే ఉంచారు. అదే సర్వే నంబరులోని ఏడెకరాలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు కేటాయించి, భవనం నిర్మించారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని తీసుకుని, 1.5 సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు అందజేసింది. ఎవరూ ఇళ్లు కట్టుకోకపోవడంతో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ఇక్కడ భూమి విలువ పెరిగింది. సెంటు భూమి రూ.లక్ష పలుకుతోంది. దీంతో టీడీపీ హయాంలో ఇళ్ల పట్టాలు ఇవ్వగా.. మిగిలిపోయిన భూమిపై వైసీపీ నాయకులు, వలంటీరు చంద్రకళ కన్నుపడింది. ఎవరికి చేతనైనంత వారు ఆక్రమించేశారు. కొందరైతే 20 సెంట్లకు పైగా కూడా కబ్జా చేసేశారు. తానేమి తక్కువ అన్నట్లు వలంటీరు చంద్రకళ ఆరు సెంట్ల స్థలాన్ని ఆక్రమించింది. చుట్టూ బండలు పాతేసి, ఇంటి నిర్మాణానికి పూనుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో నిరుపేదలు ఇల్లు కట్టుకోవాలంటే స్థలం ఎక్కడి నుంచి తీసుకొస్తారన్న వాదనలు గ్రామంలో వినబడుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఆక్రమించుకున్న స్థలాలను స్వాధీనం చేసుకుని, పేదలకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం: లక్ష్మీనారాయణ, తహసీల్దార్, రొద్దం

ఇటీవలే మండలంలో బాధ్యతలు తీసుకున్నా. సమస్య నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటాం.

కల్యాణ వైభోగమే..

అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- రామనామస్మరణతో మార్మోగిన కదిరి



సీతారాములకు ముత్యాల తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

కదిరి, ఫిబ్రవరి 21: శ్రీరామచంద్రమూర్తే వరుడై, సీతమ్మవారే వధువై పెళ్లి పీటలెక్కగా.. ఆ కల్యాణం.. వైభోగమే. చూసిన కనులదే ఆ భాగ్యం. సీతారాముల కల్యాణవైభోగాన్ని చూసి భక్తజనం పులకించిపోయారు. రామనామస్మరణతో భక్తి పారవశ్యం చెందారు. పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో సేవాభారతి ఆధ్వర్యంలో అయోధ్య సీతారాముల కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయోధ్య నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. సీతారాముల కల్యాణం సాయంత్రం 7.11 నిమిషాలకు ప్రారంభమైంది. టీటీడీ నుంచి వచ్చిన అర్చకులు వేదమంత్రాలతో కల్యాణం ప్రారంభించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన కల్యాణమండపంలో వేలాదిమంది భక్తుల రామనామస్మరణతో సీతారాముల కల్యాణం ప్రారంభమైంది. సీతారాములకు పట్టువస్త్రాలను సమర్పించారు. స్వామి, అమ్మవారికి కంకణాలు కట్టారు. జీలకర్ర, బెల్లం తలలపై ఉంచారు. అనంతరం సీతాదేవిని కన్యాదానం చేశారు. మూహూర్త సమయం రాత్రి 8.20 గంటలకు రాములవారు సీతాదేవికి మాంగల్యధారణ చేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు పోసుకున్నారు. స్వామి, అమ్మవార్లకు పెళ్లి కానుకలను భక్తులు చదివించారు. అనంతరం అన్నమయ్య ప్రాజెక్టు సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ పార్థసారథి, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, సేవాభారతి ప్రెసిడెంట్ చెన్నరాయశెట్టి పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సీతారాముల కల్యాణం తిలకిస్తే సౌభాగ్యం: చాగంటి



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తేనే ఇంటింటా సౌభాగ్యమని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఆయన ప్రవచనాలు చేశారు. శ్రీరాముడు మానవ రూపంలో ఉన్న మహావిష్ణువన్నారు. సీతాదేవి, లక్ష్మీ స్వరూపిణి అన్నారు. లక్ష్మీ నర స్త్రీకాదన్నారు. సీతారాములు ఆదర్శ దంపతులన్నారు. సీతారాముల వంశవృక్షాన్ని వివరించారు. ఆడబిడ్డ తండ్రి తల వంచుకోరాదనీ, ఠీవిగా ఉండాలని దశరథ మహారాజు జనకుడికి చెప్పిన ఘట్టాన్ని వివరించారు. సీతారాముల కల్యాణంలో ఇది అత్యంత ముఖ్యమైన ఘట్టమన్నారు. ప్రతిఒకరూ సీతారాములను ఆదర్శంగా తీసుకుని, జీవించాలని సూచించారు. అంతకుముందు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ భరత్‌కుమార్ అయోధ్యరాముడి గురించి, హిందూ ధర్మం గురించి వివరించారు.

ప్రజల సొమ్ము దోచేస్తున్న సీఎం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్‌ను కబ్జాల మార్నింగ్‌గా మార్చారు
- మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల విమర్శ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక చేత్తో బటన్ నొక్కి.. మరొక చేత్తో ప్రజల సొమ్మంతా దోచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు చేస్తూ ప్రజల సొమ్మును పీక్కు తింటున్నారని అన్నారు. సీఎం జగన్ ఒక చేత్తో బటన్ నొక్కి.. మరో చేత్తో ఇచ్చిన సొమ్ముకు పదింతలు లాగేసుకుంటున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్‌ను కబ్జా మార్నింగ్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. కబ్జాలు, దౌర్జన్యాల ద్వారా రూ.4వేల కోట్లకు పైగా దోచేశారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పనైనా జరిగిందా అని ప్రశ్నించారు. వీటిని పత్రికల్లో చూపిస్తే.. భౌతిక దాడులకు దిగుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, గుట్కా, మట్కా, విచ్చలవిడిగా సాగుతోందన్నారు. చాలా స్కూళ్లలో నాడు-నేడు పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా 9 సార్లు కరెంటు చార్జీలు పెరిగాయన్నారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్యులు, పేదలు కొనలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఇక ఇసుక, కంకర ధరలు పదింతలు పెరగడంతో పేదలు ఇళ్లు కట్టుకోవడం గగనమైందన్నారు. ధర్మవరం పట్టణమంతా గుంతలమయమైతే.. వాటిని బాగు చేయాల్సిన ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని అన్నారు. మా ఒత్తిళ్లకు తలొగ్గి ఒకటిరెండు చోట్ల బాగుచేసి.. మిగిలిన చోట్ల అలాగే వదిలేశారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. దీంతో తామే ముందుకొచ్చి తన సొంత నిధులతో గ్రామాల్లోకి వెళ్లి తాగునీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డిష్ రాజు, తుంపర్తిపరమేశ్, బోడగలగిరిధర్, దుస్సా క్రిష్ణ, దేవేంద్రనాథ్‌రెడ్డి, నారాయణస్వామి, నబీరసూల్, రాప్తాటిరాము, మార్కెట్ రహీం గొట్లూరు చంద్ర, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

నేడు చలో అనంతపురం

- జర్నలిస్టు సంఘాల పిలుపు
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసన
- అనంతకు వెళ్లకుండా ఇతర జిల్లాల జర్నలిస్టులకు నోటీసులు
- జర్నలిస్టు సంఘాల నాయకుల ఇళ్ల వద్ద పోలీసుల తిష్ట



అనంతపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు వద్ద ఈ నెల 18న నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు గురువారం 'చలో అనంతపురం' పేరిట ఆందోళనకు సిద్ధమయ్యాయి. అనంతపురం నగరంలోని సంగమేష్ సర్కిల్ నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం ఉదయం 10.30 గంటలకు నిరసన ర్యాలీ ప్రారంభమౌతుంది. కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహిస్తారు. జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారనుందని, దాడులు పునరావృతం కాకుండా పాలకులు, పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. జర్నలిస్టుల రక్షణే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న ఈ ధర్నాలో జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ నాయకులు, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, యువజన సంఘాలు భాగం కానున్నాయి. ఏపీయూడబ్ల్యూజే, ఇతర జర్నలిస్టు సంఘాల నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు హాజరుకానున్నారు.

జర్నలిస్టులకూ పోలీసు ఆంక్షలు



జర్నలిస్టులు చేపట్టిన 'చలో అనంతపురం' కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు సన్నాహాలు చేసుకున్నారు. అయితే ఆయా జిల్లాల పోలీసుల నుంచి జర్నలిస్టులకు ఆంక్షలు ఎదురవుతున్నాయి. 'చలో అనంతపురం' కార్యక్రమానికి వెళ్లొద్దంటూ ఆయా ప్రాంతాల పోలీసులు జర్నలిస్టులకు ఫోన్ చేసి హెచ్చరించారు. మరికొందరిని పోలీస్ స్టేషన్‌కు రండి అని పిలిచారు. మరికొందరు జర్నలిస్టుల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు తిష్ట వేశారు. దీన్నిబట్టి జర్నలిస్టులపై పోలీసులు ఏస్థాయిలో ఆంక్షలు అమలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రజ్యోతి అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపైనే కాకుండా, కర్నూలు, మద్దికెర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపైనా వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ నేపథ్యంలోనే... పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాలు 'చలో అనంతపురం' చేపట్టాయి. అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా జర్నలిస్టులు ర్యాలీ, ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయినా, కడప, కర్నూలు జిల్లాల్లో ఎక్కడికక్కడ ఏపీయూడబ్ల్యూజే నాయకులను నిర్బంధించడాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. చలో అనంతపురం కార్యక్రమానికి జర్నలిస్టులు హాజరయ్యే విధంగా కర్నూలు, కడప జిల్లాల పోలీసులు సహకరించాలని ఆయన కోరారు.



ఆదోని పోలీస్ స్టేషన్‌లో ఉన్న జర్నలిస్టులు



కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి విలేకరి జయరాజును అదుపులోకి తీసుకుని నోటీసులు ఇస్తున్న ఎస్ఐ

గొట్లూరులో దొంగ ఓట్లు

- పెళ్లయిన వారి ఓట్లు తొలగించాలని టీడీపీ ఫిర్యాదు
- డబుల్, షిఫ్టింగ్ ఓట్లు జాబితాలో ఉంచిన వైనం
- అధికార పార్టీ వారివి తొలగించని బీఎల్ఓలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 21: ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయని గత ఏడాది సెప్టెంబరులో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్ఓలు, ప్రతిపక్ష పార్టీలు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఈ సర్వేలో డబుల్, మరణించిన ఓట్లు, పెళ్లయిన వారి ఓట్లను గుర్తించి అధికారులకు అందజేశారు. వాటిని తొలగించాలని వారి వివరాలతో కూడిన పత్రాలను అందజేశారు. అయితే ఆ ఓటర్లు అధికారపార్టీ సంబంధించినవి కావడంతో జాబితాలో అలానే ఉంచారని ప్రతిపక్షాలు తెలుపుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్కచేయకుండా బేఖాతర్ చేస్తూ బీఎల్ఓలు సర్వేలో చూపించినా ఆ ఓట్లను తొలగించకుండా ముసాయిదా ఓటరు జాబితాలో అలాగే రావడంతో ఇంతమాత్రానికి ఎందుకు సర్వేచేయాలని ప్రతిపక్షపార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో కూడా ఇబ్బడిముబ్బడిగా డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లు బయటపడుతున్నాయి. ఇలాంటి ఓట్లే ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో వెలుగులోకి వచ్చాయి.



వరలక్ష్మి పేరుమీద తొలగించిన ఓటు, మళ్లీ అదే బూత్‌లో డబుల్ ఓట్లు

- గొట్లూరు గ్రామంలో 145, 146 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లోనూ అదేగ్రామానికి చెందిన కొంతమంది రెండు కేంద్రాల్లో ఓట్లు నమోదు చేయించుకుని ఉండటంతో ఆ ఓట్లన్నీ మళ్లీ దర్శనమిచ్చాయి. ముసాయిదా ఓటరు జాబితాలో మళ్లీ రావడంతో ప్రతిపక్షపార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

గ్రామంలో లేని ఓట్లతో వైసీపీ కొత్త డ్రామా!

గొట్లూరు గ్రామంలో పోలింగ్ కేంద్రం 145లో సీరియల్ నెంబర్ 1146 త్రివేణి చలసాని, 1196లో సునీత, 1197లో పద్మజ జ్వాల, 1198లో దేవి జ్వాల, 1254లో వరలక్ష్మీ అనే ఓటర్లు అందరూ పెళ్లయి వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. మళ్లీ 1194 వరలక్ష్మీ పేరు మీద ఓటు వచ్చింది. అలాగే 562లో వరలక్ష్మీ పేరు మీద డీలీషన్ లిస్టులో వచ్చింది. వీరందరికీ వివాహం అయి వేర్వేరు గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. వరలక్ష్మీ అనే ఓటరు సంబంధించి తండ్రి పేరు, భర్త పేరుతో డబుల్ ఎంట్రీ చేశారు. ఈ ఓటు తొలగించాలని గతంలో ఇంటింటి సర్వేలో కూడా బీఎల్ఏలు బీఎల్ఓలకు పక్కాఆధారాలతో అందించారు. ఆ ఓటును తొలగించకుండా బీఎల్ఓ మళ్లీ డబుల్ ఓటు ఎక్కించారు. ఈ ఓట్లుపై అదేగ్రామానికి చెందిన టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి సూచనలు మేరకు తొలగించాలని ఫిర్యాదు చేశారు. అయితే నారాయణస్వామి ఓ కేసులో ధర్మవరం సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. దీనిపై వైసీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిమాండ్‌లో ఉన్న వ్యక్తి ఎలా ఫిర్యాదు చేశాడంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేగ్రామానికి చెందిన మరో వ్యక్తి జైలు వద్దకు ములాఖాత్‌కు వెళ్లినప్పుడు నారాయణస్వామి గతంలో తాను ఫిర్యాదు చేసిన ఓట్లను తొలగించారా లేదా చూసుకుని మళ్లీ ఫారం-7లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అందుకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు బీఎల్ఓ వద్దకు వెళ్లగానే వెంటనే ఆ సమాచారాన్ని అధికారపార్టీకి చేరవేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారపార్టీ నాయకులు అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



వివాహం అయి వేరేప్రాంతాల్లో నివసిస్తున్న బి.సునీత, పద్మజ జ్వాల

ఇంటింటా సర్వే చేసినా మారని బీఎల్ఓలు

గతేడాది సెప్టెంబరు, నవంబరు నెలల్లో డబుల్, డెత్, షిఫ్టింగ్ ఓట్లు తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల బీఎల్ఏలతో కలిసి బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేశారు. ఈ సర్వేలో ఆధారాలతో సహా బీఎల్ఏలు బీఎల్ఓలకు అందించారు. అయినా వాటిని తొలగించకుండా మళ్లీ జాబితాలో అవే వచ్చేలా చేశారు. దీంతో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విధులను ఉల్లంఘిస్తున్న బీఎల్ఓలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్డీఓకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

గొట్లూరులో ఓట్ల అవకతవకలపై బుధవారం టీడీపీ నాయకులు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. జైలులో ఉన్న నారాయణస్వామి గ్రామంలో లేని ఓట్లను నాపేరు మీద ఫారం7 దరఖాస్తు చేసి తొలగించాలని అదేగ్రామానికి చెందిన గిరక చంద్రశేఖర్‌కు చెప్పాడని, ఆయన సూచన మేరకు ఫారం7 దరఖాస్తు చేశామని దీంతో ఓట్ల అవకతవకలపై ఓ కమిటీ వేసి విచారణ చేసి తొలగించాలని కోరారు. తప్పుచేసే ప్రతి బీఎల్ఓలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. అలాగే గొట్లూరు గ్రామంలో ఇబ్బడి ముబ్బడిగా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ స్పందిస్తూ ఫిర్యాదులో ఇచ్చిన ఓట్లను పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, తలారిచంద్రమోహన్, విజయసారథి, విజయ్‌చౌదరి, రాంపురం శీనా, అమరేంద్ర, చిరంజీవి, చంద్రశేఖర్, అశోక్ ఉన్నారు.



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ దుర్మరణం

మరో ఇద్దరు కూడా...



ఎస్ఐ ఎన్వీ రమణ (ఫైల్)



పవన్‌సాయి (ఫైల్)

అనంతపురం క్రైం/ భూత్పూర్ (మహబూబ్‌నగర్), ఫిబ్రవరి 21: అతివేగంగా వెళుతూ అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో జిల్లా వాసి, ప్యాపిలి ఎస్ఐ రాచర్ల వెంకటరమణ (55), అల్లుడు పవన్‌సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) ఉన్నారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. నంబూరి వెంకటరమణ తన కుటుంబంతో అనంతపురంలోని షిర్డీనగర్‌లో నివాసం ఉండేవారు. ప్రస్తుతం ఈయన నంద్యాల జిల్లాలోని ప్యాపిలిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన కూతురు అనూషకు హైదరాబాద్‌లోని మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు పవన్‌సాయికి ఇచ్చి ఈ నెల 15న వివాహం జరిపించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని వరుడి ఇంటి దగ్గర నిర్వహించిన విందుకు ఎస్ఐ వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఎస్ఐ వెంకటరమణ, అతని కూతురు అనూష, అల్లుడు పవన్‌సాయి, కారు డ్రైవర్ చంద్ర కలిసి షిఫ్ట్ కారులో అనంతపురానికి బయలుదేరారు. భూత్పూర్ మండలంలోని అన్నసాగర్ గ్రామం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ఎస్ఐ వెంకటరమణ (55), అల్లుడు పవన్‌సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) అక్కడికక్కడే మరణించారు. అనూషకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన అనూషను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివాహం జరిగిన వారం రోజులకే పవన్‌సాయి మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా, వెంకటరమణ గతంలో జిల్లాలో హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

పరిశ్రమలో ప్రమాదం

- వేడిద్రవం పడి ఏడుగురికి గాయాలు

హిందూపురం, ఫిబ్రవరి 21: మండలం గోళ్లాపురం పారిశ్రామికవాడలో ఉన్న కుబేర స్టీల్స్ పరిశ్రమలో బుధవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుని ఏడుగురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. అందులో పనిచేస్తున్న ఇతర కార్మికులు తెలిపిన వివరాల మేరకు పరిశ్రమలోపల గుజిరీని కరిగించే బాయిలర్‌లోకి ఖాళీ డ్రమ్ములు వేశారు. అయితే అందులో గ్యాస్ ఉండటంతో అవి పగిలి దగ్గరలో పనిచేస్తున్న కార్మికులపై వేడి ద్రవం పడింది. సంఘటనలో యూపీ, మధ్యప్రదేశ్‌కు చెందిన క్రిష్ణ, సోలాం, పంచరత్తన్, ప్రవీణ్‌కుమార్, డింపుల్ కుమార్, బిట్టప్ప, త్రిబువన్‌లకు గాయాలయ్యాయి. వీరిని హిందూపురం ఆసుపత్రికి తరలించకుండా ప్రైవేటు వాహనంలో కర్ణాటకలోని గౌరీబిదనూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ప్రమాద విషయాలు తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు వినోద్, సురేష్ గౌరీబిదనూరు ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ వారి వివరాలను ఆరాతీశారు. బాయిలర్ వద్ద డ్రమ్ములు పగిలి బయటపడి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కొంత ఆస్తినష్టం జరిగినట్లు తెలిసింది.

పకడ్బందీగా ఓటరు ఫిర్యాదుల పరిశీలన

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 21: ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను పగడ్బందీగా పరిశీలిస్తున్నట్లు కలెక్టరు గౌతమి రాజకీయ పార్టీల నాయకులకు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు.. తదితర వాటిపై రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత ఇచ్చిన ఫారం 6,7,8 లను నిబంధనల మేరకు పక్కాగా పరిశీలిస్తున్నామన్నారు. ఫారం 6,8లకు సంబంధించి ఎలాంటి సమస్యా లేదని, ఫారం-7కు సంబంధించి వచ్చిన డెత్ కేసులు, డూప్లికేట్ ఓట్లపై ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని అన్నారు. సమావేశంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐఎం, బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడులపై సీఎం స్పందించకపోవడం విడ్డూరం

- శ్రీపీఠం పీఠాధిపతి



పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 21: బీసీలకు పెద్దపీట వేశామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం వారిపైనే దాడులు చేస్తున్నా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. దాడులకు సీఎం జగన్ మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. పెనుకొండలోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో పరిపూర్ణానందస్వామి బుధవారం మాట్లాడుతూ.. రాప్తాడు సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణా రహితంగా కొట్టడం, కాళ్లతో తన్నడం దారుణమన్నారు. సాక్షాత్తూ సీఎం సభలో ఒక వ్యక్తిని ఇంతగా కొట్టడం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా.. ఇంతవరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీ సామాజికవర్గానికి పెద్దపీట వేస్తామని అధికార వైసీపీ గొప్పలు చెబుతోందన్నారు. మత్స్యకార కుటుంబానికి చెందిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ బీసీ కాదా అని ప్రశ్నించారు. దాడిచేసిన వారిని గుర్తించి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రాక్షస చర్య: గోనుగుంట్ల


ధర్మవరం: ప్రభుత్వ దౌర్జన్యాలను వెలికితీస్తే పాత్రికేయులపై దాడులు చేస్తారా అంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు పాల్పడటం రాక్షస చర్యగా అభివర్ణించారు.

పది పరీక్షల పరిశీలకుడిగా ఆర్‌జేడీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21: ఉమ్మడి అనంతపురం జిల్లా పదో తరగతి పరీక్షల జిల్లా పరిశీలకుడిగా పాఠశాల విద్య కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డిని నియమించారు. 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు పదో తరగతి పరిశీలకులుగా విద్యాశాఖలోని సీనియర్ అధికారులను ని యమించారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిశీలకుడిగా ఆయనను ని యమిస్తూ ఇటీవల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించేందుకు వీరిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీకృష్ణపై దాడికి నిరసనగా 24న దీక్ష

- బెస్త సేవాసంఘం నాయకులు



మాట్లాడుతున్న బెస్త సేవా సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: ఫొటోగ్రాఫర్ బెస్త శ్రీకృష్ణపై వైసీపీ మూ కల దాడిని వ్యతిరేకిస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నట్లు బెస్తసేవా సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బెస్త సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరి, బెస్త సేవా సంఘం నాయకుడు కేవీ రమణ మీడియాతో మాట్లాడారు. బెస్త కృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు భాస్కర్, నాగరాజు, గంగన్న, శ్రీనివాస్, నరసప్ప, కుళ్లాయప్ప, సురేష్, బాలన్న, మారుతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

26న కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 26వ తేదీన జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం పెద్దఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశామని, అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షులు షర్మిల హాజరవుతారని తెలిపారు. ఇక్కడి నుంచే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఒకే సారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏమి చేయబోతున్నది సభలో చెబుతామన్నారు. పార్టీ బలంగా ఉన్నప్పుడే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. 50 వేల మందితో సమావేశం ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేశామన్నారు. అంతకంటే ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సభే కాకుండా మరో 4 సభలు నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్, విశాఖ ఉక్కు, రాజధాని, ప్రత్యేక హోదా తదితర విభజన హామీలపై సమావేశంలో వివరిస్తామన్నారు. సమావేశాలకు తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. అలాగే రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు సంబంధించి ప్రతి బస్సుకు రూ.20 వేలు ఇచ్చారని, దాన్ని అధికారులతో పాటు వలంటీర్లు వాడుకున్నారని వచ్చిన వారు చెప్పారన్నారు. అసలు ఇది ప్రభుత్వ సభా, పార్టీ సభ అన్నది అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు రవికృష, రామానాయుడు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే బల ప్రదర్శన

- సీఎం జగన్‌పై శైలజానాథ్ విమర్శలు
- మీడియాపై దాడులు నీచం అంటూ ధ్వజం



మాట్లాడుతున్న శైలజానాథ్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 21: సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందనీ, అందుకే సిద్ధం సభల పేరుతో బల ప్రదర్శనకు దిగుతున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాప్తాడులో గంట సిద్ధం సభ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి జన సమీకరణ చేశారన్నారు. డబ్బు, మద్యంతో ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు బస్సులు లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు అనుకూలంగా నడుచుకోవాలి తప్ప.. ఇబ్బందులు పెట్టకూడదన్నారు. రాప్తాడు సిద్ధం సభలో ఉమ్మడి అనంత ప్రజల బాగోగులు గురించి ఒక్క మాటైనా మాట్లాడావా అంటూ ముఖ్యమంత్రిని నిలదీశారు. ఓటమి భయంతోనే జగన్ భయపెట్టే ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగా వైసీపీ అరాచకాలను బయటి ప్రపంచానికి చెబుతున్న మీడియాపై దాడు లు చేయిస్తున్నారన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడులు అందులో భాగమేనన్నారు. మీడియాపై దాడులు నీచమన్నారు. మొదట ఎమ్మెల్యేలను ఇష్టారాజ్యంగా తరిమేసిన జగన్.. ఇప్పుడు భయంతో బతిమాలి మళ్లీ పార్టీలోకి తీసుకునేందుకు మధ్యవర్తిత్వం నడుపుతున్నారంటూ ఎద్దేవా చేశారు. మాయల ఫకీరు ప్రాణం చిలుకలో ఉన్నట్లు జగన్ ప్రాణం కాంగ్రెస్ పార్టీలో ఉందన్నారు. జగన్ సోదరి పీసీసీ ప్రస్తుత అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టగానే ఆయన కళ్లలో భయం కనిపిస్తోందన్నారు. ఇక, ఈనెల 26న అనంతపురంలో నిర్వహించ తలపెట్టిన సభకు ఏఐసీసీ పెద్దలు రానున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్, పెనుకొండ ఇన్‌చార్జి కేటీ శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి కాలవ సరిత పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21: జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందని వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. క్షేత్రస్థాయిలో పశువైద్యులతో పరీక్షలు చేయించామని, జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ సోకలేదని తేలిందని అన్నారు.

నేటి నుంచి పల్లె ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి, ఫిబ్రవరి 21 : మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి గురువారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మొదటి రోజు బుక్కపట్నం మండలం గోపాలపురం నుంచి ఉదయం 9గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందని , ప్రచారంలో ఆరు మండలాలకు చెందిన కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని బుధవారం ఆయన ప్రకటనలో కోరారు.

పలువురికి గోనుగుంట్ల ఆర్థికసాయం

ధర్మవరం, ఫిబ్రవరి 21: పట్టణంలో పలువురికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ధర్మవరం మండలం నేలకోట ఎస్సీ కాలనీకి చెందిన మౌనిక గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న గోనుగుంట్ల ఆమె వైద్యఖర్చుల కోసం భర్త కోటప్పకు రూ15వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మీనరసమ్మ కుమారుడు వీరప్రతాప్, కోడలు అర్చనలు పలు కారణాలతో మృతిచెందారు. దీంతో లక్ష్మీనరసమ్మకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

ధర్మవరం, ఫిబ్రవరి 21: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో ప్రమాదవశాత్తూ ఓ యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ పెయింటింగ్ పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో అయితే బుధవారం లక్ష్మీచెన్నకేశవపురంలో ఓ ఇంటిలో పెయింటింగ్ పనులు చేస్తుండగా.. సమీపంలో ఉన్న విద్యుత్ మెయిన్ లైన్ ప్రమాదవశాత్తూ తగిలింది. దీంతో అతను షాక్ గురై కింద పడి గాయపడ్డాడు. తోటి కార్మికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేశారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

26న కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- మాజీమంత్రి సాకే శైలజానాథ్

ధర్మవరంరూరల్/ పుట్టపర్తి ఫిబ్రవరి21: అనంతపురం జిల్లా కేంద్రం నుంచి ఈనెల 26న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖరావం పూరిస్తామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని పార్టీ కార్యాలయంతో పాటు పుట్టపర్తిలోని మేడ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 26న జరిగే ఎన్నికల శంఖరావం సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, ఇతర ముఖ్యనేతలు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర అధ్యక్షుడు రంగన అశ్వర్థనారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్, నాయకుడు కోటా సత్యం తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల గదుల సీజ్

- గుడ్‌విల్ చెల్లించాలంటూ మున్సిపల్ అధికారుల ఒత్తిడి

ధర్మవరం, ఫిబ్రవరి 21: ధర్మవరంలోని కాయగూరల మార్కెట్‌లో పై అంతస్తులో గల రిజిస్ట్రేషన్ కార్యాలయ డాక్యుమెంట్ రైటర్ల గదులను మున్సిపల్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. రైటర్ల నుంచి ఒక్కో గదికి రూ.9.50లక్షల మేర గుడ్‌విల్ చెల్లించాల్సిందేనంటూ డిమాండ్ చేయడంతో అందుకు అయిష్టంగానే ఒప్పుకున్న రైటర్లు ఇప్పటికే దాదాపు 50 శాతం అప్పోసప్పో చేసి గుడ్‌విల్ రూపంలో చెల్లించారు. అప్పటినుంచి ఆన్‌లైన్ సమస్య వల్ల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతుండటంతో ఆదాయం లేక వారికి బాడుగ చెల్లించడానికే గగనంగా మారింది. ఈ తరుణంలో మున్సిపల్ అధికారులు ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి మిగిలిన గుడ్‌విల్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఒక నెల గడువుఇవ్వాలని కోరినప్పటికీ వినిపించుకోకుండా వారి 12 గదులను సీజ్ చేశారు.

బీమా పరిహారం అందజేత

తాడిమర్రి, ఫిబ్రవరి 21: ఎస్‌బీఐలో బీమా చేసుకుని ప్రమాదవశాత్తూ మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ఆ బ్యాంకు శాఖ అధికారులు పరిహారం అందజేశారు. పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన బాలరాజు నార్పల మండలంలో లైన్‌మెన్‌గా పనిచేసేవారు. ఆయన ఎస్‌బీఐ తాడిమర్రి శాఖలో వ్యక్తిగత ఖాతా కలిగి ఉండటంతోపాటు ఏడాదికి రూ.1000 విలువైన ప్రమాద బీమా చెల్లించేవారు. కాగా ప్రమాదవశాత్తూ ఆయన ఇటీవల మృతిచెందడంతో.. భార్య లావణ్యకు రూ.20లక్షల చెక్కును బ్యాంకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 21: కేంద్రం అనుసరిస్తున్న విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28 వతేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్షవిద్యార్థిసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వారు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా, విద్యరంగ, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో మతపరమైన దాడులను అరికట్టాలన్నారు. నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దు చేసి, మూడేళ్ల డిగ్రీని కొనసాగించాలన్నారు. అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాల్లో విద్యార్థి సంఘ ఎన్నికలను పునరుద్ధరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి విద్యార్థులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నరసింహ, పోతులయ్య, ఉపేంద్ర, అరుణ్, రాజేష్, రంజిత్, పృథ్వీరాజ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు



ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



తాడిమర్రి మండలం మద్దెలచెరువులో..

- భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకుల విమర్శ

ధర్మవరం, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలకృష్ణ విమర్శించారు. పట్టణంలోని 11వ వార్డులో బుధవారం వారు టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ.. పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. అభివృద్ధి పనులు ఏమాత్రం జరగలేదని దుయ్యబట్టారు. రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్ నాయుడు, శీలామూర్తి, తలారి చంద్ర మోహన్‌బాబు, చింతపులుసు పెద్దన్న, అంబటిసనత్, రాళ్లపల్లిషరీఫ్, అత్తార్ రహీంబాషా, మాదన సుబ్బయ్య, జిలకరశీన, గోసల శ్రీరాములు, మాధవరెడ్డి, మారుతీస్వామి, శ్రీనివాసులు, తిరుమలేశ్, ఇర్షాద్, షామీర్, నాగేంద్ర, బీరేశీన, వీర, వాసుదేవ, మాదనమహేశ్వరి, స్వర్ణకుమారి, శారద, నాగరత్న, మీనాక్షమ్మ,మున్ని, చౌడమ్మ, అఖిలమ్మ, భాను, యశోద, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి/ ధర్మవరం రూరల్/ గాండ్లపెంట: మండలకేంద్రంతో పాటు మద్దెలచెరువు గ్రామంలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి మినీమేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, ముంటిమడుగు హర్ష, రామానాయుడు, పక్కీర్‌రెడ్డి, చలపతి, గణేశ్, సాయి, రామచంద్రారెడ్డి, బీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరం మండలం మల్కాపురం, గొట్లూరు గ్రామాల్లో జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కన్వీనర్ పోతుకుంటల క్ష్మన్న, సీనియర్ నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, నాయకులు విజయసారథి, రాఘవరెడ్డి, అమరేంద్ర, అనిల్ గౌడ్, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, పాళ్యంవెంకటేష్, విజయ్‌చౌదరి, భాస్కర్‌చౌదరి, తలారివెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. గాండ్లపెంట మండలకేంద్రంలో టీడీపీ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, నాయకులు ఆనంద్, ఈశ్వర్ రెడ్డి, క్రిష్ణమోహన్, అక్రమ్, సద్దాం, రవి, హనుమంతు, ఖాదర్‌బాషా తదితరులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.



ధర్మవరం మండలం మల్కాపురంలో..



గాండ్లపెంటలో..

ఉమ్మడి ప్రభుత్వంతోనే అభివృద్ధి: జనసేన



ప్రజలతో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరుతూ మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో బుధవారం జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పత్తి చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. ప్రజలతో మమేకమై గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలన్నా.. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావాలన్నా.. ఉమ్మడి పార్టీలతోనే సాధ్యమన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు కొండబోయన సతీష్, తలసాని దివాకర్‌రెడ్డి, శంకర్, భార్గవ్, క్రిష్ణ, గిరి పాల్గొన్నారు.

బంగారం వ్యాపారిపై హత్యాయత్నం



షకీల్ (ఫైల్)

కదిరి, ఫిబ్రవరి 21: పట్టణంలోని ఓ బంగారు షాపు యజమాని షకీల్‌పై బుధవారం రాత్రి హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు, బాధితుడి బంధువులు తెలిపారు. పట్టణంలోని చౌకసర్కిల్లో బంగారు షాపు నిర్వహిస్తున్న షకీల్ టవర్ క్లాక్ సమీపంలోని ఓ పాన్ షాపు వద్దకు వెళ్లారు. అయితే అక్కడున్న ఓ యువకుడు ఉన్నట్టుండి షకీల్‌పై దాడి చేసి కత్తితో గొంతు కోశాడు. చుట్టుపక్కలవారు ఇది గమనించి బాధితున్ని పక్కనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమచికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. దాడి చేసిన వ్యక్తి అష్పాక్‌గా బాధితుడి బంధువులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

'బీసీలంతా ఒకేతాటిపై నడవాలి'



ర్యాలీలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 21 : బీసీలందరూ ఐక్యతగా ఒకేతాటిపై నడిస్తే రాజ్యాధికారం సాధ్యమంటూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేశన శంకరయ్య పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆయన బీసీలతో కలిసి స్థానిక గణేష్ సర్కిల్ నుంచి శిల్పారామం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. సమాజంలో 80శాతం ఉన్న బీసీలు కేవలం పార్టీల జెండాలు మోయడానికి ఉపయోగపడుతున్నారని వాపోయారు. బీసీలు విభజించు పాలించు పదతిలో విడిపోయినందున మన బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. పార్టీ ఏదైనా బీసీ కులాలు సంఘటితంగా పోరాటం చేస్తే అధికారం మనదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు పీసీ గంగన్న, సామకోటి ఆదినారాయణ, కొట్టాల శ్రీరాములు, డీఎస్పీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'బీసీల పేరుతో రాజకీయాలు చేస్తే సహించం'

పుట్టపర్తి, ఫిబ్రవరి 21: ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో కొందరు బీసీల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని, దీన్ని సహించేదిలేదంటూ బోయ వాల్మీకి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు మండిపడ్డారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు వ్యక్తులు ఎన్నికలు వచ్చే సమయానికి ఎక్కడలేని ప్రేమ చూపుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ కనిపించని ఈ బీసీ నాయకులు ఇప్పుడు వచ్చి బీసీలు ఏకం కావాలంటే మీటింగ్‌లు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పదవుల కోసం బీసీలపై ఎక్కడలేని ప్రేమ చూపుతున్నారన్నారు. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే మిగతా సమయంలో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. వారి రాజకీయ ఎదుగుదల కోసం బీసీలను బలిచేస్తున్నారని, బీసీలంతా ఇది గమనించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, కొత్తచెరువు టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, తెలుగు యువత పార్లమెంట్ కార్యదర్శి బళ్లారి సుధాకర్, నాయకులు బండ్లపల్లి రాజు, కేశప్ప, శివ, సోము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాష తెలుగును ప్రతిఒక్కరు కాపాడాలన్నారు. తెలుగు భాష పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

తనకల్లు, ఫిబ్రవరి 21: మండలంలోని దుగినేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం జరిపారు. టీటీడీ ఆధ్వర్యంలో కృష్ణశిలతో ప్రత్యేకంగా తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. తర్వాత సీతారాముల కల్యాణం జరిపారు. మూడురోజుల పాటు గ్రామంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు కొర్తికోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎస్‌కే మస్తాన్‌వలి అన్నదానం చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ప్రతిష్ఠ అయిన సీతారాముల విగ్రహాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కల్యాణోత్సవంలో నూ పాల్గొన్నారు. తర్వాత ఆయన్ను గ్రామస్థులు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కందికుంట వెంట మండల కన్వీనర్ తొట్లిరెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నరసింహులు, సరోజమ్మ, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



పూజల్లో పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్

ఎన్నికల విధుల్లో సెక్టార్ అధికారులే కీలకం: కలెక్టర్



సెక్టార్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, ఫిబ్రవరి 21 : రానున్న ఎన్నికల విధుల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పెండింగ్ పనులు పూర్తిచేయాలి

పుట్టపర్తిరూరల్: జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పనులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్సు ద్వారా ఎన్నికలకు సంబంధించిన వివిధ పనులపై అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫారం-6, ఫారం -8పనులను మొత్తం పూర్తి చేయాలన్నారు. ధర్మవరం ఆర్డీఓ ఈపనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అలాగే హిందూపురం, కదిరి, పెనుకొండలలో కేటాయించిన పనుల్ని సంబంధిత అధికారులు సకాలంలో పూర్తీచేయాలన్నారు. కదిరి, హిందూపురం, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లు పెండింగ్‌పనులు లేకుండా చూడాలని ఆదేశించారు. రామగిరి, పుట్టపర్తి, చిలమత్తూరులో ఎన్నికల పెండింగ్ పనులు ఉన్నట్లు గుర్తించామని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశాలిచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కదిరి: కదిరి డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. పట్టణంలోని కుమ్మరవాండ్లపల్లి మండలపరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో గల 145, 146 పోలింగ్‌కేంద్రాలతోపాటు గంగన్నగారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 149 పోలింగ్ కేంద్రం, ముత్యాలచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలోని 136 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్డీవో వంశీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ముకుంద, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అరిగెల సాలమ్మకు ఘన నివాళి



అరిగెల సాలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 21: పట్టణంలో అరిగెల సాలమ్మ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని ఆమె కుమారులు బుధవారం అరిగెల పోతన్న రైస్‌మిల్లులో నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొని సాలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులు పుట్టపర్తి రహదారిలో గల శివాలయం ఎదుట, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మొత్తం వేల మందికి అన్నదానం చేశారు.

ముగిసిన క్రీడాపోటీలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 21 : పట్టణంలోని సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో జరుగుతున్న క్రీడల పోటీలు బుధవారం ముగిశాయి. మూడు రోజులుగా జరిగిన పోటీల్లో రాయలసీమలోని జిల్లాల్లోని 31కళాశాలల నుంచి 134జట్లు, 1684మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆఖరి రోజు జరిగిన పోటీల్లో క్రికెట్ విజేతగా సంస్కృతి విద్యార్థులు, రన్నర్స్‌గా ధర్మవరానికి చెందిన శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు, కబడ్డీ విజేతలుగా రాజంపేట అన్నమాచార్య మహిళా విద్యార్థులు, రన్నర్స్‌గా సంస్కృతి విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారు. వీరందరికీ కళాశాల చైర్మన్ బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.

ఫైనాన్స్ ముసుగులో దోపిడీ

- కొండంత తాకట్టు.. గోరంత రుణం
- ఆస్తి విక్రయిస్తేనే వడ్డీకి అప్పు
- నెలనెలా వడ్డీ చెల్లించకపోయినా షరతులు మామూలే
- గడువులోగా విడిపించుకోకపోతే ఆస్తి గోవిందే
- పురంలో నయా బిజినెస్





హిందూపురం

రాయలసీమలోనే ఫైనాన్స్ కంపెనీలకు హిందూపురం పెట్టింది పేరు. ఇది ఇప్పుడు కాదు దశాబ్దాల నుంచి ఫైనాన్స్ కంపెనీలకు హిందూపురం అడ్డా అని చెప్పవచ్చు. ఒకప్పుడు ఆటోలు, లారీలు, ద్విచక్రవాహనాలకు ఫైనాన్స్ ఇచ్చేవారు. కానీ కాలానుగుణంగా కొంత మంది ఫైనాన్షియర్లు ఇచ్చే రుణంలో కూడా మార్పు తెచ్చారు. అప్పట్లో ఏదైనా వస్తువు తీసుకుంటే వస్తువు విలువతో రుణం ఇచ్చేవారు. లేదా మనం ఏదైనా ఆస్థి తాకట్టు పెట్టి రుణం కావాలంటే బ్యాంకులో కంటే పది నుంచి పదిహేను శాతం తగ్గించి ఇచ్చేవారు. మరి కొంత మంది బ్యాంకు కంటే ఎక్కువగానే ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం హిందూపురంలో కొంత మంది ఫైనాన్షియర్లు కొండంత ఆస్తి వారి పేరు మీద చేస్తే గోరంత రుణం షరుతులతో ఇస్తారు. ఒకవేళ వారు చెప్పిన నిబంధనల మేరకు డబ్బు ఇవ్వకపోతే తాకట్టు పెట్టిన ఆస్తి ఇక మరచిపోవాల్సిందే. ఇది హిందూపురంలో ఫైనాన్స్ రూపంలో జరుగుతున్న దోపిడీ అంటూ కొంతమంది ప్రత్యక్షంగా విమర్శిస్తున్నారు. అలాంటి ఫైనాన్షియర్లకు పాలకులు, అధికారుల అండ ఉండటంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతూ కోట్లకు పడగలెత్తారంటే అతిశయోక్తి కాదు. పట్టణంలో కొంత మంది ఫైనాన్షియర్లు రియల్టర్లుగా మారి విలువైన ఆస్తులు కూడకట్టారు.

గోరంత రుణం

హిందూపురంలో కొంత మంది ఫైనాన్షియర్లు మారిన కాలానికి అనుగుణంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. ఇందులో కొంత మంది రుణం కావాలని సదరు ఫైనాన్షియర్లను కలిస్తే ఆస్తులు మా పేరు మీద చేస్తే రుణం ఇస్తామంటారు. అది కూడా పలు షరతులు విధిస్తారు. అయినా కొంత మంది అవసరాలను, ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వీరి వ్యాపారం సాఫీగా జరుగుతోంది. ఉదాహరణకు రూ. 20 లక్షల విలువచేసే ఆస్తి ఫైనాన్షియర్ పేరు మీద రిజిస్టర్ అగ్రిమెంట్ చేస్తే రూ. 2 లక్షలు ఇస్తారు. లేదా వారి పేరు మీద ఆస్తి మొత్తం రిజిస్ట్రేషన్ చేస్తే నాలుగు లేదా రెండు లక్షలు రుణం ఇస్తారు. అది కూడా నిర్ణీత గడువులోనే నెలనెల వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పట్టణంలో పేరుమోసిన కరోనా సమయంలో ఓ వ్యక్తి రూ. 25 లక్షల విలువచేసే ఆస్తిని ఫైనాన్షియర్ పేరు మీద రిజిస్టర్ అగ్రిమెంట్ చేయించాడు. అప్పట్లో ఆ వ్యక్తికి అతను ఇచ్చింది కేవలం రూ. 5 లక్షలే. అయితే కరోనా సమయంలో వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో సదరు యజమానికి తెలియకుండానే ఆస్తిని ఫైనాన్షియర్ సొంతం చేసుకున్నాడు. ఆ తరువాత సదరువ్యక్తి వెళ్లి వడ్డీ అసలు చెల్లిస్తానని చెప్పినా వినలేదు. ఇదే ఫైనాన్షియర్ కర్ణాటక సరిహద్దులో ఐదు ఎకరాల భూమిని తన పేరు మీద రిజిస్టర్ అగ్రిమెంట్ చేయించుకొని రుణం ఇచ్చాడు. అయితే ఆ ఆస్తి యజమాని అనారోగ్యం బారిన పడి ఏడాదిన్నరపాటు ఇటు వైపు రాలేదు. ఏడు నెలలు వడ్డీ చెల్లించాడు. అయినా ఫైనాన్షియర్ ఆస్తిని సొంతం చేసుకున్నాడు. అయితే ఈ ఆస్తి విలువ మూడు కోట్లు పైమాటేనని సమాచారం. అయితే ఆస్తికి సంబంధించి ఆ కుటుంబ వారసులు కోర్టుకి వెళ్లినట్లు సమాచారం. పట్టణ పరిధిలోని వాణిజ్యకేంద్రంగా పేరు గాంచిన ప్రాంతంలో ఓ వ్యాపారి సుమారు. రూ. 2 కోట్లు విలువ చేసే ఇంటిని తాకట్టు పెట్టి రూ. 25 లక్షలు రుణం తీసుకున్నాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో చెప్పిన సమయానికి రుణం చెల్లించలేదని ఇంటిని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఫైనాన్షియర్ ఇలాంటివి పదుల సంఖ్యలో సొంతం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరో ఫైనాన్షియర్ డీబీ కాలనీలో రూ. 50 లక్షలు విలువచేసే ఖాళీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అందుకుగాను రూ. 10 లక్షల రుణం ఇచ్చాడు. అందులో సగం రుణం చెల్లిస్తూ నెలనెలా వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. అయితే పరిస్థితుల ప్రభావంతో 5 నెలలు వడ్డీ చెల్లించలేదని ఆ స్థలాన్ని తన పేరుమీద చేయించుకున్నాడు. ఆ తరువాత ఆ స్థలాన్ని వెనక్కి తీసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఆఖరికి అధికార పార్టీకి చెందిన నేత ద్వారా ఒత్తిడి చేయించి మరో పది లక్షలు చెల్లించి ఆ స్థలాన్ని వాపసు తీసుకోవాల్సి వచ్చింది. ఇలాంటివి హిందూపురం పట్టణంలో కోకొల్లలుగా జరుగుతున్నాయి.

షరతులు వర్తిస్తాయి


ఆస్తి తాకట్టు పెట్టిన వారి రుణానికి సంబంధించి రూ. 3 నుంచి రూ. 5 వరకు వడ్డీ చెల్లించాలి. అలా చెల్లించకపోయినా షరతులు వర్తించే విధంగా బాండు పేపర్ మీద వారి వద్ద రాయించుకుంటారు. షరతుల్లో ఏ ఒక్కటి వర్తించకపోయినా ఆస్తి వదులుకోవాల్సింది. అయితే కొంత మంది ఫైనాన్షియర్లు ఆస్తి తాకట్టు పెట్టుకొని రోజు, వారం, నెల, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ఈ లెక్కన రుణం ఇస్తారు. ఇప్పటివరకు కొంత మంది ఫైనాన్షియర్ల వద్ద తాకట్టు పెట్టిన ఆస్తులు వదులుకున్న వారే అధికంగా ఉన్నారు. పదిహేనేళ్ల క్రితం రూ. 10 కోట్లలోపు ఫైనాన్స్ ఇచ్చే వ్యక్తి నేడు 200 కోట్లుకు ఎదిగాడు అంటే ఏ రీతిలో ఫైనాన్స్ నడుపుతున్నారో అర్థమవుతోంది

ఓ వైపు పాలకులు.. మరోవైపు అధికారుల అండ..

పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారి ఆస్తులను తాకట్టు పెట్టుకొని రుణాలు ఇచ్చే ఫైనాన్షియర్లకు ఒక వైపు పాలకులు, మరో వైపు అధికారుల అండ పుష్కలంగా ఉంది. దీంతో ఫైనాన్షియర్ల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. కొంత మంది ఫైనాన్షియర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా ఉంటూ స్థానిక ముఖ్యనేతలకు కావాల్సినప్పుడు రుణం ఇవ్వడం కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడంతో వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు చూస్తుంటారు. అధికారులు సైతం ఫైనాన్షియర్లకు అనుకూలంగా ఉండటం, వారికి అవసరమైనప్పుడు తమ వంతు సహకారం అందిస్తుంటారు. దీంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారని విమర్శలు ఉన్నాయి.

భక్తుల కొంగుబంగారం


గుడ్డం లక్ష్మీవేంకటేశ్వరుడు





స్వామిఅమ్మవార్ల పాదాలను తాకిన సూర్యకిరణాలు

పావగడ, ఫిబ్రవరి 21: భక్తుల కొంగుబంగారంగా పిలువబడే గుడ్డం లక్ష్మీవేంకటరమణస్వామి దేవాలయంలో లక్ష్మీమాత విగ్రహాన్ని బుధవారం సూర్యకిరణాలు తాకాయి. దీంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. తాలూకా పరిధిలోని ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన వెంకటమ్మనహళ్లి గ్రామసమీపంలో పురాతన గుడ్డమయ్య ఆలయం ఉంది. రామగిరి మండలం మక్కనేరిపల్లికి సమీపంలో కర్ణాటక సరిహద్దులోని ఒక గుట్టపై కొలువుదీరిన గుడ్డమయ్య స్వామిని దర్శించుకోవడానికి పావగడ తాలూకా కెంచగానపల్లి, బుడ్డారెడ్డిపల్లి, బొమ్మగానపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని వేపకుంట, మక్కినేరుపల్లి, రామగిరి, పేరూరు తదితర గ్రామాల నుంచి భక్తులు వస్తారు. ఉగాది పర్వదినాన, అమావాస్య రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏకాదశి రోజున జాతర, మహిళలు జ్యోతులుమోయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయానికి కుడివైపున బసవన్న, ఏనుగు ఆకారంలో ఉన్న రాతి విగ్రహం కనిపిస్తుంది. నాలుగు బండరాళ్లతో కట్టిన గుడ్డమయ్య ఆలయాన్ని శ్రీలక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంగా ప్రస్తుతం పిలుస్తున్నారు. ఆలయ జీర్ణోద్ధరణను పావగడ వివేకానంద విద్యాసంస్థల కార్యదర్శి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జీ వెంకటరామయ్య, ఆలయ కమిటీ సభ్యులు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు.



గుడ్డం లక్ష్మీవేంకటరమణ స్వామి ఆలయం

పేట్రేగిపోతున్న దొంగలు

వ్యవసాయ బోర్లు, స్టార్టర్లకు అమర్చిన కేబుల్‌వైర్లే టార్గెట్

మడకశిర రూరల్ ఫిబ్రవరి 21: వ్యవసాయ బోర్లు, స్టార్టర్లకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో 350 మందికి రైతులకు చెందిన వ్యవసాయబోర్ల కేబుల్‌వైర్లను దుండగులు తీసుకెళ్లారు. మండలంలోని వైబీ హళ్లి పంచాయతీలో మంగళవారం రాత్రి 40 మంది రైతులకు సంబంధించిన బోర్లు, స్టార్టర్లకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వైబీహళ్లిలో 15 మంది, గొల్లపల్లి 5, పంతికుంట 5, జిల్లేడగుంట 15 మందికి చెందిన కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకుని దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.



కేబుల్ వైర్ చోరీకి గురైన వ్యవసాయబోరును చూపుతున్న రైతు

దొంగలను పట్టుకోవాలి..

రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేస్తారు. అటువంటి రైతులకు చెందిన వ్యవసాయబోర్లు, స్టార్టర్లకు అమర్చిన కేబల్‌వైర్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. తరచూ వైర్లను దొంగలించుకుపోతున్నారు. దీంతో సాగుచేసిన పంటలను నీరు అందించలేకపోతున్నాం. పోలీసులు దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించి రైతులను రక్షించాలి.

- హర్షవర్ధన్ రెడ్డి. రైతు, వైబీ హళ్లి గ్రామం

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బలిజ సంఘం నాయకుల డిమాండ్

చిలమత్తూరు, ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ మూకలను కఠినంగా శిక్షించాలని మండల బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ మూకలు అమానుషంగా వ్యవహరించి మీడియా ప్రతినిధిపై దాడి చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఎంతో కాలం సాగవన్నారు. అవినీతి, అక్రమాలను ఎండగట్టే మీడియాపై వైసీపీ నాయకులు ప్రతాపం చూపడం ఏంటని ప్రశ్నించారు. ప్రశ్నించేవారిని అణగదొక్కడం వైసీపీ ప్రభుత్వానికి మామూలైపోయిందన్నారు. ముఖ్యమంత్రి ఉన్న నిండు సభలో దాడి జరుగుతున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. దాడిని బలిజ సంఘం ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, బాబు, రామాంజి, రమణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న బలిజసంఘం నాయకులు

దాడులు జరుగుతున్నా చర్యలేవీ..?



వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

రొళ్ల, ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పాత్రికేయులు బుధవారం రొళ్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమేష్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్నాథ్, నాగరాజు, భీమరాజు, రామాంజనేయులు, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆగడాలకు అంతులేకుండాపోతోంది..



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

అగళి: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని విలేకరులు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అంతులేకుండా పోతోందన్నారు. అగళి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం వారు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను బయటపెట్టడం తప్పా..? అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలపై దాడులు అధికమయ్యాయన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దాడికిపాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో విలేకరులు శివప్ప, మంజునాథ్, హనుమంతరావు, తిమ్మరాజ్, భోజరాజ్, రాజేష్, చిరంజీవి, దేవరాజు, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 21: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అమరాపురం మండలం నిడ్రఘట్ట పంచాయతీ పరిధిలో 25 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారన్నారు. భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదేనని, రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్న సంకల్పంతో ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. నిడ్రఘట్ట పంచాయతీకి చెందిన వైసీపీ 9వవార్డు మెంబర్ దొడ్డరంగప్ప, ఆ పార్టీ నాయకులు శివన్న, పాండురంగప్ప, నారాయణప్ప, కిష్టప్ప, సురేష్, గుజ్జారప్ప, మంజునాథ్, తిప్పేస్వామితోపాటు వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. గుండుమల తిప్పేస్వామి వారికి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆర్.జయకుమార్, జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

బాబు హయాంలోనే అభివృద్ధి
టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

రొళ్ల, ఫిబ్రవరి 21: చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి జరిగిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. రొళ్ల మండలం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద సెల్ఫీ చాలెంజ్‌కు సంబంధించిన ఫొటో దిగారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. టీడీపీ హయాంలో మూడు బాలుర పాఠశాలలు, బాలికల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు నిర్మిచడం జరిగిందన్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిరా వరకు రింగ్‌రోడ్డు, వంద పడకల ఆస్పత్రి, హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను మడకశిరకు తాకించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.50కోట్లు, ఇలా నియోజకవర్గంవ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, జిల్లాకురుబ సాధికార కన్వీనర్ గోవిందప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పటి అభివృద్ధే కనిపిస్తోంది
తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ

రొద్దం, ఫిబ్రవరి 21: టీడీపీ హయాంలోని అభివృద్ధే పెనుకొండ నియోజకవర్గంలో ఇప్పటికీ కనిపిస్తోందని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ అన్నారు. బుధవారం ఆర్.కొట్టాల గ్రామం సమీపంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై సెల్ఫీ చాలెంజ్ చేశారు. పెనుకొండ-పావగడ ప్రధాన రహదారి 20 కి.మీల కోసం రూ.33కోట్ల నిధులను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదలచేశారన్నారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి అభివృద్ధి పనులకు కృషిచేశారన్నారు. రొద్దం మండలంలో జూనియర్ కళాశాల, ఎంజేపీ పాఠశాల ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే కృషిచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా అంతా తామే చేశామన్న కల్లిబొల్లి మాటలు చెబుతోందని విమర్శించారు. గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు తెచ్చి అనేక చెరువులకు నీరందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఆమె వెంట తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లప్పచౌదరి, ఉపేంద్ర ఉన్నారు.



పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై సెల్ఫీచాలెంజ్ చేస్తున్న సుబ్బరత్నమ్మ

26న అప్రకటిత విద్యుత్ కోతలపై టీడీపీ ధర్నా

మడకశిర రూరల్/టౌన్ ఫిబ్రవరి 21: అప్రకటిత విద్యుత్ కోతలపై టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 26న ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మనోహర్, లక్ష్మినారాయణ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నా పట్టించుకునేవాడే కరువయ్యాడన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ధర్నాకు హాజరవుతారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 21: ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి కంచిసముద్రం గ్రామంవద్ద చోటుచేసుకుంది. చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన మేకలప్పగారి సురేష్(26) పని నిమిత్తం కర్ణాటక ప్రాంతానికి వెళ్లాడు. పనిముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా నగిరి గెరవద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. లేపాక్షి పోలీసులు గమనించి 108లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి'

గుడిబండ, ఫిబ్రవరి 21: విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు సూచించారు. బుధవారం మండలంలోని మద్దనకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. మంచి ఫలితాలు సాధిస్తే పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తెచ్చినవారవుతారన్నారు.

కళాశాలలో సరస్వతి పూజ

గోరంట్ల, ఫిబ్రవరి 21: పట్టణంలోని ఎస్‌ఎపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సరస్వతి పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. మంచి ఉత్తీర్ణత సాధించడంతోపాటు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులు, రమేష్, రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 21: తెలుగుభాషా దినోత్సవాన్ని బుధవారం లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్‌కుమార్, చైతన్య గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మేళాపురం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయులు అన్నాడని గుర్తుచేశారు. తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు. మాతృభాషపై మమకారాన్ని మరువకూడదన్నారు. పాఠశాలల్లో తెలుగుభాషకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మనోజ్, శ్రీరాములు, జుబేర్, శ్యాంబాబు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మడకశిరటౌన్, ఫిబ్రవరి 21: మడకశిర తహసీల్దార్‌గా బుధవారం వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా నుంచి ఆయన మడకశిరకు బదిలీ అయ్యారు.

ఎన్నికల విధుల్లో సెక్టార్ అధికారులే కీలకం: కలెక్టర్

పుట్టపర్తి, ఫిబ్రవరి 21 : రానున్న ఎన్నికల విధుల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

పుట్టపర్తిరూరల్: జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పనులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్సు ద్వారా ఎన్నికలకు సంబంధించిన వివిధపనులపై అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫారం-6, ఫారం-8పనులను మొత్తం పూర్తి చేయాలన్నారు. ధర్మవరం ఆర్డీఓ ఈపనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే హిందూపురం, కదిరి, పెనుకొండలలో కేటాయించిన పనుల్ని సంబంధిత అధికారులు సకాలంలో పూర్తీ చేయాలన్నారు. కదిరి, హిందూపురం, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లు పెండింగ్‌పనులు లేకుండా చూడాలని ఆదేశించారు.

సమయపాలన పాటించాల్సిందే

ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవు

డీసీహెచ్ రవికుమార్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 21: సిబ్బంది సమయపాలన పాటించకుండా ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని అనంతపురం డీసీహెచ్ పాల్ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ముఖ్యంగా వైద్యులు సమయానికి రావాలన్నారు. నెల రోజుల రికార్డులను తీసుకుని ఎవరు ఏ సమయానికి వచ్చారో ఎఫ్ఆర్ఎస్ ఉపయోగించి తెలుసుకుంటామన్నారు. విధులకు గైర్హాజరైతే అలాంటి వారిని తొలగిస్తామని హెచ్చరించారు. సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆసుపత్రిలో కలయతిరిగారు. వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన ఇన్‌పేషెంట్లను ఒకే గదిలో ఉంచడాన్ని ఆయన ప్రశ్నించారు. ఆడవారిని ఒక వైపు, మగవారు మరోవైపు ఉండేలా చూడాలని సూచించారు. ఆపరేషన్ థియేటర్‌లోకి రోగిని తీసుకెళ్లే సమయంలో తప్పకుండా తలకు టోపీ, ఆసుపత్రి డ్రస్‌ను వేయాలన్నారు. గుండెనొప్పితో బాధపడుతున్న రోగులను పరీక్షించే వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కావాల్సిన మందులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్